

**రెండో రోజూ నేవీ విన్యాసాలు**

తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో నేవీ రిహార్సల్స్ ఆదివారం కూడా విశాఖ సాగర తీరంలో కొనసాగాయి. సాయంత్రం 4.30 గంటల నుంచి ఆరు గంటల వరకు పలురకాల విన్యాసాలు నిర్వహించారు.

-వార్తా మెయిన్‌లో



# రోలుగుంట పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యంతో మహిళ మృతి

**బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపణ**

శ్వాస సమస్యతో రాత్రి 11.30 గంటలకు తల్లిని ఆస్పత్రికి తీసుకువచ్చిన కుమారుడు

- మూసిఉన్న తలుపులు, లోపల నిద్రపోతున్న సిబ్బంది
- అర్ధగంట తరువాత తీరిగ్గా తలుపులు తీసి.. డాక్టర్లు లేరని సమాధానం
- రోగిని నర్సీపట్నం తీసుకెళ్లాలని సలహా
- ఏరియా ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- అప్పటికే మృతిచెందిన మహిళ
- పేరుకే 24/7 వైద్య సేవలు
- ఇద్దరు వైద్యుల్లో ఒక్కరు కూడా స్థానికంగా నివాసం ఉండని వైనం
- నర్సీపట్నం నుంచి రాకపోకలు



మృతిచెందిన వైదాసు లక్ష్మి (ఫైల్ ఫొటో)



రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రోలుగుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

**స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యుల్లో ఒక్కరు కూడా స్థానికంగా నివాసం వుండడంలేదు. రాత్రిపూట విధుల్లో వుండే సిబ్బంది సైతం తాళాలువేసి పడుకుంటున్నారు. రోగులు ఎవరైనా అత్యవసర వైద్య సేవల కోసం వస్తే.. తాళాలు తీయడంలేదు. ఈ కారణంగానే శనివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. వైద్యులు స్థానికంగా నివాసం వుండి వుంటే ఆమె బతికేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పీహెచ్‌సీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని వారు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మృతురాలి కుమారుడు వైదాసు గణేశ్, బంధువులు తెలిపిన వివరాలిలా వున్నాయి.**

రోలుగుంట గ్రామానికి చెందిన వైదాసు లక్ష్మి(59) శనివారం రాత్రి శ్వాసతీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుమారుడు గణేశ్, బంధువులు పొలుమూరి శ్రీను, తంగేటి ఆచారి, తంగేటి మణి, తదితరులు రాత్రి 11.30 గంటల సమయంలో వాహనంలో ఎక్కించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఆస్పత్రి తలుపులు మూసేసి, లోపల తాళం వేసివుంది. సిబ్బంది నిద్రపోతున్నారు. దీంతో వారు దాదాపు అరగంట సేపు తలుపులు కొట్టారు. ఎట్టకేలకు సిబ్బంది తలుపులు తీసి, డాక్టర్లు ఎవరూ లేరని, రోగిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులిద్దరూ స్థానికంగా నివాసం వుండడం లేదు. సుమారు పది కిలోమీటర్ల దూరంలోని నర్సీపట్నంలో వుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వైద్యులకు ఫోన్ చేసి, వాళ్లు వచ్చే సరికి చాలా సమయం పడుతుందన్న ఉద్దేశంతో లక్ష్మిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. రోలుగుంట పీహెచ్‌సీలో రాత్రి విధుల్లో వున్న సిబ్బంది వెంటనే స్పందించి ప్రాథమిక వైద్యం అందించినా, ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు స్థానికంగా నివాసం వున్నా.. తన తల్లి ప్రాణాలు నిలిచేవని కుమారుడు గణేశ్ ఆవేదనతో చెప్పారు. తన తల్లి మృతికి కారణమైన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

కాగా మృతురాలు లక్ష్మి కుటుంబ సభ్యుల ఆరోపణలపై వైద్యాధికారిణి ధనలక్ష్మికి 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరణ కోరగా, శనివారం రాత్రి డ్యూటీలో ఉన్న సిబ్బంది వెంటనే స్పందించి, రోగి పల్స్ చెక్ చేశారని, పల్స్ పడిపోవడంతోనే మెరుగైన చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారని చెప్పారు. ఈ సంఘటనపై సోమవారం ఉదయం విధులకు వచ్చిన తరువాత శనివారం రాత్రి విధుల్లో వున్న సిబ్బందికి మెమోలు ఇచ్చి విచారణ చేపడతానని తెలిపారు.

### పేరుకే 24 గంటల ఆస్పత్రి!

రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులతోపాటు సిబ్బంది ఉన్నారు. ఇక్కడ 24 గంటలూ వైద్య సేవలు అందించాలి. కానీ రాత్రిపూట వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఇద్దరు డాక్టర్లలో ఒక్కరు కూడా స్థానికంగా నివాసం వుండకుండా నర్సీపట్నం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తరువాత ఇక్కడ ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో వుండడంలేదు. రాత్రిపూట విధుల్లో వుండే సిబ్బంది కూడా మొక్కుబడిగా సేవలు అందిస్తున్నారు.

# ఆయుష్‌కు ఊపిరిలూదేనా?

**వైద్యులు, సిబ్బంది కొరతతో సేవలపై ప్రభావం**

- ఉమ్మడి జిల్లాలో 38 ఆయుష్ డిస్పెన్సరీలు
- సగానికిపైగా కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీ
- అధ్వాన స్థితిలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం
- కుర్చీలు కూడా లేని దుస్థితి

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

**ప్రజలకు ప్రాచీన, సంప్రదాయ వైద్యాన్ని అందించేందుకు నెలకొల్పిన ఆయుష్ డిస్పెన్సరీలను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఖాళీల భర్తీకి పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోగులకు సక్రమంగా సేవలందని పరిస్థితి నెలకొంది. ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య పద్ధతులను కలిపి ఆయుష్‌గా పేర్కొంటారు. ఉమ్మడి జిల్లాలో 38 ఆయుష్ డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో అనేకచోట్ల రోగులను పరీక్షించి, సమస్యను గుర్తించేందుకు వైద్యులు లేరు. కొన్నిచోట్ల అటెండర్లు లేకపోవడంతో మందులు అందించడం నుంచి అన్ని పనులూ వైద్యులే చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.**



విశాఖలోని ఆయుష్ ఆర్డీడీ కార్యాలయం



నక్కపల్లి మండలం వేంపాడులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల. ఇక్కడ మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్ పోస్టులు ఖాళీగా వున్నాయి.

### అనకాపల్లి జిల్లాలో...

అనకాపల్లి జిల్లాలో 11 ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉండగా, 34 పోస్టులకుగాను 22 ఖాళీగా ఉన్నాయి. వేంపాడులో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, హరిపాలెంలో కాంపౌండర్, ఏఎన్ఎం, అటెండర్, గవరపాలెం, లింగరాజుపాలెం, కొత్తకోట, దేవరాపల్లిల్లో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కన్నూరుపాలెంలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, ఎంఎన్‌వో మాత్రమే పనిచేస్తున్నారు. హోమియో డిస్పెన్సరీల విషయానికి వస్తే..ఎలమంచిలిలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు, పాయకరావుపేటలో కాంపౌండర్, ఎ.కొండూరులో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, ఏఎల్ పురంలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, ఎం.కోడూరులో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్ పోస్టులు, అచ్యుతాపురం డిస్పెన్సరీలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది

### అల్లూరి జిల్లాలోనూ అంతే..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆయుర్వేద విభాగానికి సంబంధించి నాలుగు డిస్పెన్సరీలు ఉన్నాయి. వాటిలో మొత్తం 12 పోస్టులు ఉండగా 10 ఖాళీగా ఉన్నాయి. అడ్డాకుల డిస్పెన్సరీలో మాత్రమే మెడికల్ ఆఫీసర్, కాంపౌడర్ ఉన్నారు. అక్కడ స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు ఖాళీగానే ఉంది. మిగిలిన మూడు (అరకు, దుంబ్రిగుడ, గంపరాయి) డిస్పెన్సరీల్లో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల మూడు డిస్పెన్సరీల పరిధిలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే జిల్లాలో మూడు హోమియో డిస్పెన్సరీలు ఉండగా, పాడేరులో మాత్రమే మెడికల్ ఆఫీసర్ ఉన్నారు. అక్కడ కూడా కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీలేరు, తాజంగిలో మెడికల్ ఆఫీసర్, కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీ. ఈ రెండు డిస్పెన్సరీల . ... మిగతా 6వ పేజీలో

# ప్రపంచ తెలుగు మహాసభలకు ఏటికొప్పాక హస్త కళాఖండాలు

- అతిథులకు జ్ఞాపికలుగా ఇవ్వడానికి ఆర్డర్ ఇచ్చిన నిర్వాహకులు

ఎలమంచిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభలకు ఏటికొప్పాక కళాకారులు అంకుడు కర్రతో తయారు చేసిన దేవతా మూర్తుల కళాఖండాలను పంపుతున్నట్టు స్థానిక కళాకారుడు జి.సంతోశ్ తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సమీపంలో వున్న హెచ్ఐసీసీ కాంప్లెక్స్‌లో జరుగనున్న ఈ మహాసభలకు హాజరయ్యే ప్రముఖులకు జ్ఞాపికగా అందజేసేందుకు పద్మావతి, అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి హస్తకళారూపాలను సిద్ధం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకుల కోరికమేరకు వీటిని తయారు చేసి పంపుతున్నామని ఆయన చెప్పారు.



ప్రపంచ తెలుగు మహాసభలకు పంపడానికి ఏటికొప్పాక కళాకారులు సిద్ధం చేసిన కళాఖండాలు

# 37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు

- ఒక వార్డర్ సస్పెన్షన్
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే క్షమించేది లేదు
- ఉత్తరాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్



రవికిరణ్, జైళ్ల శాఖ డీఐజీ

విశాఖపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారంలో శనివారం రాత్రి ధర్నా చేసిన ఘటనలో 37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు ఉత్తరాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ ఎం.రవికిరణ్ తెలిపారు. సెంట్రల్ జైలులో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా పోలీసు, జైళ్ల శాఖలో పనిచేసే ఉద్యోగులెవరూ ధర్నాలు, నిరసనలు తెలపకూడదని నిబంధనలున్నాయన్నారు. అయితే విశాఖ సెంట్రల్ జైలులో వార్డర్స్ నియమావళికి వ్యతిరేకంగా, ఇతర సిబ్బంది విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించారన్నారు. ఈ నేపథ్యంలో ధర్నా చేసిన 37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, వారిని రాష్ట్రంలోని వివిధ జైళ్లకు అటాచ్‌మెంట్ ట్రాన్స్‌ఫర్స్ చేస్తున్నట్టు ప్రకటించారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని, ధర్నాలు, నిరసనలకు దిగకూడదన్నారు. ఏకంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగడం క్షమార్హం కాదన్నారు. వార్డర్ వాసుదేవరావును సస్పెండ్ చేయడంతో పాటు ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### సిబ్బందిలో కనిపించని క్రమశిక్షణ

కేంద్ర కారాగారం సిబ్బందిలో క్రమశిక్షణ లేకపోవడాన్ని గమనించామని డీఐజీ తెలిపారు. తప్పుచేసిన వార్డర్ వాసుదేవరావును ప్రత్యేక గదిలోకి తీసుకువెళ్లి తనిఖీ చేయడం నేరం ... మిగతా 6వ పేజీలో

# సంద్రంలో బోటు బోల్తా మత్స్యకారుడి మృతి



కొవిరి మసేను (ఫైల్ ఫొటో)

పరవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో బోటు బోల్తా పడిన ప్రమాదంలో మత్స్యకారుడు మృతి చెందాడు. ముత్యాలమ్మపాలెం తీరం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలమ్మపాలెం పంచాయతీ దిబ్బపాలెం గ్రామానికి చెందిన కొవిరి మసేను(30), చింతకాయల ముత్యాలనాయుడు, చింతకాయల దేముడు, కొవిరి ముత్యాలు, చింతకాయల అప్పారావు, చింతకాయల దేముడు కలిసి ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటలకు బోటుపై సముద్రంలో వేటకు బయలుదేరారు. తీరం నుంచి సుమారు 300 మీటర్లు లోపలికి వెళ్లిన తరువాత అలలు ధాటికి బోటు బోల్తా పడింది. ఈ క్రమంలో కొవిరి మసేను బోటు కింద ఉండిపోయాడు. సహచర మత్స్యకారులు వెంటనే బోటును సాధారణ స్థితికి తీసుకువచ్చారు. మసేను అప్పటికే స్పృహ కోల్పోవడంతో బోటుపై తీరానికి తీసుకొచ్చారు. కానీ అప్పటికే మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ముత్యాలమ్మపాలెం తీరానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహానికి అనకాపల్లిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

# బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు



సూర్యారావు (ఫైల్ ఫొటో)



తీవ్రంగా గాయపడిన మంగమ్మ

సబ్బవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి అమ్ములపాలెం జంక్షన్ సమీపంలో సర్వీసు రోడ్డుపై ఆదివారం రాత్రి ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ టి.రవికుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. సబ్బవరం మండలం నారపాడు శివారు బలిజపాలెం గ్రామానికి చెందిన కోసూరు సూర్యారావు(48) సబ్బవరంలో టైలరింగ్ చేస్తుంటాడు. భార్య మంగమ్మ బలిజపాలెంలో వీఆర్‌పీ (విలేజ్ రిసోర్స్ పర్సన్)గా పని చేస్తున్నది. సూర్యారావు ఆదివారం ఉదయం యథావిధిగా టైలరింగ్ నిమిత్తం సబ్బవరం వచ్చాడు. మంగమ్మ మధ్యాహ్నం తరువాత సబ్బవరం సంతకు వచ్చింది. ఇద్దరూ కలసి రాత్రి ఏడు గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. అమ్ములపాలెం సమీపంలో వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొన్నది. దీంతో భార్యభర్తలు రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ టి.రవికుమార్, స్థానికులు కలిసి అనకాపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా సూర్యారావు దారిలో మృతిచెందాడు. మంగమ్మను ఆస్పత్రికి తీసకెళ్లారు. కాగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన తరువాత ట్రాక్టర్‌తోసహా డ్రైవర్ పరారయ్యాడని, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా పట్టుకుంటామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

# కొడుకుని చంపేసిన తండ్రి

**సన్నికల్లు రాయితో తలపై మోది హత్య**

- మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ
- ఆర్థిక వ్యవహారాలే కారణం
- నిందితుడు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి



హత్యకు గురైన భాస్కర్ (ఫైల్ ఫొటో)



నిందితుడు కొటారి రమణ

నర్సీపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

**మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన ఓ తండ్రి.. కన్న కొడుకుని సన్నికల్లు రాయితో కొట్టి, దారుణంగా హత్య చేశాడు. ఆర్థిక లావాదేవీలే ఇందుకు కారణమని తెలిసింది. నర్సీపట్నంలో కలకలం సృష్టించిన ఈ సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ జి.గోవిందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.**

నర్సీపట్నంలోని వెంకునాయుడుపేట శివారు లక్ష్మీనగర్‌లో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కఠారి రమణకు కుమారుడు భాస్కర్ (32), కుమార్తె పావని ఉన్నారు. రమణ భార్య పార్వతి పదేళ్ల క్రితం మరణించింది. పావనికి వివాహం కావడంతో భర్తతో కలిసి ధర్మసాగరంలో నివాసం ఉంటున్నది. భాస్కర్‌కు ఇంకా వివాహం కాలేదు. తండ్రి, కుమారుడు వెంకునాయుడుపేట శివారు లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. భాస్కర్ ఏ పనిచేయకుండా ఖాళీగా వుంటూ, తండ్రి పెన్షన్ డబ్బులతో మద్యం సేవిస్తూ జల్సా చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వకపోతే తండ్రిని కొడుతుండేవాడు. దీంతో విసిగిపోయిన రమణ.. మూడు నెలల క్రితం తన ఆస్తిని కూతురు పేరున రాయడానికి సిద్ధమయ్యాడు. ఏటీఎం కార్డుని కుమార్తె వద్ద ఉంచాడు. ఈ విషయాలపై మూడు నెలల నుంచి తండ్రి, కొడుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి రమణ, భాస్కర్‌తోపాటు జిలానీ అనే యువకుడు కలిసి రమణ ఇంటిలోనే మద్యం తాగారు. ఈ సందర్భంగా ఏదో విషయమై తండ్రి, కొడుకు మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. మద్యం తాగడం పూర్తయిన తరువాత జిలానీ తన ఇంటికి వెళ్లిపోయాడు. తండ్రీకొడుకులు ఆర్థికపరమైన విషయాలపై మరోసారి గొడవ పడ్డారు. ఘర్షణ పెద్దది కావడంతో కఠారి రమణ సన్నికల్లు రాయి తీసుకుని భాస్కర్ తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతనను అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం పని మనిషి ... మిగతా 6వ పేజీలో

## పుణ్యకోటిపై పురుషోత్తముడు


అలంకరణలో శ్రీవారు

నక్కపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. తెల్లవారుజామున కొండపై ఉన్న స్వామి నిజరూపానికి అర్చకులు కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం చేసి, ధూప,దీప నైవేద్య నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. కింద ఆలయంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు నిత్య హోమాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. అనంతరం పుణ్యకోటి వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నండూరి రాజ గోపాలాచార్యులు, రంగబాబు, పవన్‌కుమార్, జ్ఞాన ప్రమోద్ తదితరులు ఉన్నారు.

## టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు


విద్యార్థుల తరఫున నగదు బహుమతులు, సర్టిఫికెట్లందుకున్న తల్లిదండ్రులు

పాయకరావుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ ఏడాది టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన కాపు సామాజికవర్గానికి చెందిన ముగ్గురు విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.10వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేసింది. దీనికి సంబంధించి అసోసియేషన్ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీరామమూర్తి అందించిన వివరాలివి.. కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లాలో ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో 580 మార్కులు సాధించిన కాపు సామాజకవర్గానికి చెందిన 13 మంది విద్యార్థులకు రూ.10వేల చొప్పున స్కాలర్ షిప్‌తోపాటు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. వీరిలో మండలంలోని గుంటపల్లికి చెందిన గట్టెం శ్రీలేఖ, అరట్లకోటకు చెందిన గర్లంక గీతాశ్రీ, పాయకరావుపేటకు చెందిన బల్ల రోహిత్ ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారం నంద్యాలలో జరిగిన అసోసియేషన్ వార్షికోత్సవంలో వీటిని అందించారు.

## విశ్వకర్మ సంఘం ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న సంఘ ప్రతినిధి రమణ

కోటవురట్ల, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని యండపల్లి గ్రామంలో ఆదివారం విశ్వకర్మల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధి ఎం.రమణ మాట్లాడుతూ విశ్వకర్మల సమస్యలపరిష్కారానికి సమష్టిగా నడవాలన్నారు. మరో ప్రతినిధి తంగేటి శివాజీ మాట్లాడుతూ వచ్చేనెల 5న నిర్వహించే కమిటీ సమావేశానికి విశ్వబ్రహ్మణ హాజరుకావాలన్నారు. అనంతరం నూతన ఎంపికస్తామన్నారు. సంఘం నూతన కార్యవర్గం ఎంపిక జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తంగేటి వెంకట్రావు, దాసరి వెంకటరావు, ధర్మరాజు, శివాజీ , మాణిక్యం, రమేశ్ పాల్గొన్నారు.

## ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

రాంబిల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపాలెం గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సాయంత్రం 4 గంటల సమయంలో జీడితోట వద్ద జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేశామని చెప్పారు. ఈ దాడిలో మైలపల్లి కృష్ణ, బొబ్బిలి సోములు, యన్నరెడ్డి అప్పన్న, బద్ది నాగు, దోని కాశియ్య పట్టుబడ్డారన్నారు. వారిని అరెస్టు చేశామని, సోమవారం కోర్టుకు తరలిస్తామని ఎస్ఐ తెలిపారు.

## ఆయుష్‌కు ఊపిరిలూదేనా?

... 5వ పేజీ తరువాయి

బాధ్యతలను పాడేరు మెడికల్ ఆఫీసరే చూస్తుంటారు.

**విశాఖలో కాస్త మెరుగు**

విశాఖ జిల్లాల్లో ఐదు ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉండగా ఉక్కు నగరంలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, కేజీహెచ్‌లోని డిస్పెన్సరీల్లో స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన నాలుగుచోట్ల మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. హోమియోకు సంబంధించి ఐదు డిస్పెన్సరీలు ఉండగా, 15 పోస్టులకు గాను ఆరు ఖాళీలు ఉన్నాయి. ప్రసాద్ గార్డెన్స్‌లోని డిస్పెన్సరీలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, వేపగుంటలో కాంపౌండర్ పోస్టు, మిందిలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, అగనంపూడిలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో రెండు యునాని డిస్పెన్సరీలు ఉండగా, రెల్లివీధిలో కాంపౌండర్ పోస్టు, భీమునిపట్నంలో కాంపౌండర్, ఏఎన్ఎం, ఎఫ్ఎన్‌వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**అధ్వానంగా ఆర్‌డీడీ కార్యాలయం**

మధురవాడలో 1987లో ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాటుచేశారు. ఆరు జిల్లాలను పర్యవేక్షించే కార్యాలయం ఒక చిన్న గదిలో నడుస్తోంది. అక్కడ కూర్చునేందుకు సరైన కుర్చీలు, ఫైళ్లు భద్రం చేసేందుకు బీరువాలు, కంప్యూటర్లు లేవు. దీనిపై ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించలేదని చెబుతున్నారు.

## 37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు

... 5వ పేజీ తరువాయి

కాదన్నారు. అనుమానం వచ్చిన వారిని ఇలా తనిఖీ చేయడం జైళ్లు, పోలీసు శాఖలో సాధారణమేనన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వార్డర్ ఒకరు కొంత మంది ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్నట్టు ప్రత్యేక నిఘా వర్గాల ద్వారా తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే అనుమానితుడిని తనిఖీ చేశారన్నారు. జైలులో ఇబ్బందికర వాతావరణం నెలకొందనే సమాచారం మేరకు ప్రభుత్వం మహేశ్‌బాబును సూపరింటెండెంట్‌గా నియమించి, సరిదిద్దే బాధ్యతను అప్పగించిందన్నారు. ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కేంద్ర కారాగారంలో సుమారు రెండు వేల మందికి పైగా ఖైదీలున్నారని. వారిలో 82 మంది రౌడీషీటర్లు కూడా ఉన్నారన్నారు. బ్యారక్‌లను ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకు అన్‌లాక్, సాయంత్రం ఆరు గంటలకు లాకప్ చేయాల్సి ఉందన్నారు. అయితే ఉదయం వార్డర్ తాళాలు తీయాల్సి ఉండగా ఆ పనిని ఖైదీలతో చేయించడం చట్టవిరుద్ధమన్నారు. దీనిని సూపరింటెండెంట్ ప్రశ్నిస్తే అది ఇక్కడ మామూలే అని సమాధానమివ్వడం క్రమశిక్షణా రాహిత్యమన్నారు. జైలులో సమస్యలను నివారించేందుకు సుమారు 200 మంది ఖైదీలను రాజమంహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్టు డీఐజీ వివరించారు.

## కొడుకును చంపేసిన తండ్రి

... 5వ పేజీ తరువాయి

వచ్చేసరికి భాస్కర్ రక్తపుమడుగులో విగతజీవిగా పడివున్నాడు. రమణ మద్యం మత్తులోనే వున్నాడు. వెంటనే ఆమె ఈ విషయాన్ని అదే ఇల్లు పైఅంతస్థులో ఉంటున్న వారికి చెప్పింది. వాళ్లు ధర్మసాగరంలో నివాసం ఉంటున్న పావనికి కూడా ఫోన్ చేసి సమాచారం చెప్పారు. పావని వచ్చి చూసి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ గోవిందరావు సంఘటనా స్థలానికి చేరుకొని రమణను, అతని కుమార్తె పావనిని విచారించారు. రమణ, భాస్కర్‌తో కలిసి మద్యం సేవించిన జిలానీని పిలిపించి శనివారం రాత్రి ఏం జరిగిందన్నదానిపై ఆరా తీశారు. నిందితుడు రమణను అదుపులోకి తీసుకున్నారు.


గాంధీనగర్ కాలనీలో ప్రమాద భరితంగా ఉన్న రోడ్డు


కోర్టుపేటలో పునరుద్ధరణ పనులు కరువు

# గోతుల రోడ్లు.. రాకపోకలకు అగచాట్లు

» ఎలమంచిలిలో అధ్వానంగా రహదారులు

ఎలమంచిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నాటికి రహదారులపై గోతులు పూడ్చాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా మునిసిపల్ అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో ప్రజలు నిత్యం అవస్థలతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను సైతం పట్టించుకోని మునిసిపల్ అధికారులు, పాలకుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులను కనీసం పట్టించుకోక పోవడంతో చాలాచోట్ల గోతులు పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్ల గోతులను పూడ్చాలని ఆదేశించడంతో పట్టణ ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. ఇంజనీరింగ్ విభాగం అధికారులు రోడ్లను గుర్తించారు. వీటిలో ప్రమాదకరంగా ఉన్న రోడ్ల గోతులు లేకపోవడం విశేషం. నిత్యం వందలాది మంది ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగించే రోడ్ల వదిలేయడం ఏమిటని పలువురు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. గుర్తించిన రోడ్లపై గోతులు పూడ్చడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలోని కోర్టుపేట కాలనీ ప్రధాన రోడ్డుపై నుంచి అటు కోర్టు అధికారులు, సిబ్బందితో పాటు సమీపంలోని స్కూలుకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై గోతులతో వాహనదారులు, సైక్లిస్టులు అదుపు తప్పి ప్రమాదానికి గురవుతున్నారు. అలాగే, గాంధీనగర్ కాలనీ ప్రధాన రోడ్డు ఎంపీడీ కార్యాలయం చెంతనే ఉన్నా పట్టించుకోలేదు. ఈ విషయంపై మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారుల వద్ద ప్రస్తావించగా, మునిసిపాలిటీలో గుర్తించిన 15 పనులను రోడ్ల గోతులను పూడ్చినట్టు చెప్పారు. పలుమార్లు గ్రామ పర్యటనకు వచ్చిన అధికారులకు, పాలకులకు సమస్య విన్నవించినా ఫలితంలేక పోతోందని వాపోతున్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే ప్రజారంజక పాలన

**రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ, మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు**


ప్రగడ నాగేశ్వరావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల, స్థానిక నేత బొద్దపు నాగేశ్వరావు తదితరులు

ఎలమంచిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రజారంజక పాలన అందించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. మునిసిపాలిటీ పెదపల్లిలో ఆదివారం రాత్రి ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి సేవలు అందించిన వారికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోద కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన వారిని అభినందించి సత్కరించారు. ఏపీఆర్‌డీసీ చైర్మన్ పదవి పొందిన ప్రగడ నాగేశ్వరావును పప్పల చలపతిరావుతో పాటు స్థానిక నేతలు బొద్దపు నాగేశ్వరావు, బొద్దపు శ్రీను, నమ్మి రమణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె నానాజీ, క్లస్టర్ ఇన్‌చార్జి ఆడారి ఆదిమూర్తి, నాకులు దంట్ల వెంకటస్వామి, పందల సూరిబాబు పాల్గొన్నారు.

## వైభవంగా సోలాపూర్ అమ్మవారి జాతర


అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్నభక్తులు

ఎలమంచిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఖరగ్‌పూర్‌లోని సోలాపూర్ అమ్మవారి జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పదేళ్ల క్రితం ఖరగ్‌పూర్ నుంచి వచ్చి స్థిరపడిన అరుణ దుర్గారావు కుటుంబీకులు ఈ జాతర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఖరగ్‌పూర్ నుంచి వచ్చిన పురోహితులు ప్రత్యేకంగా పసుపుతో రూపొందించిన అమ్మవారి ఘటాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఘటాలతో రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి పట్టణ వీధుల్లో భారీగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## నునపర్తిలో అక్రమ నిర్మాణం అడ్డగింత

అచ్యుతాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నునపర్తి పంచాయతీ పరిధిలోని గ్రామ కంఠంలో అక్రమ నిర్మాణాన్ని గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. సర్వే నంబరు 93లోని సుమారు రెండున్నర సెంట్ల భూమి తమదేనంటూ కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు మండిపడ్డారు. దీనిపై ఇరువర్గాల వారు అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారమయ్యే వరకు నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించారు. ఆదివారం రేకులషెడ్ వేయడనికి ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు.

## భవన నిర్మాణ కార్మికుడి కుటుంబాన్ని అదుకోవాలి

అచ్యుతాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)లో కాంట్రాక్టరు వద్ద శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎ.దుర్గారావు (35) పనిచేస్తూ ప్రమాదవశాత్తు చనిపోయాడని, అతని కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆదివారం డిమాండ్ చేశారు. అలాగే ఇక్కడ వివిధ కర్మాగారాల్లో పొట్ట కూటి కోసం వచ్చి చాలా మంది పనులు చేస్తున్నారని, వారికి సరైన రక్షణ కల్పించాలని కోరారు. అతని వెంట సంఘ సభ్యులు గారి రమణ, లక్ష్మణరావు, చంద్రరావు, లక్ష్మి ఉన్నారు.

# పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి

» హోం మంత్రి వంగలపూడి అనిత


హోం మంత్రికి సమస్య వివరిస్తున్న యువకులు

నక్కపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఆదివారం మండలంలోని పెదబోదిగల్లం సర్పంచ్ ముస్నీషా బేగం నేతృత్వంలో ఆ గ్రామస్థులు హోం మంత్రి అనిత నివాసానికి వెళ్లి తమ సమస్యలను మంత్రికి వివరించారు. పెదబోదిగల్లం వద్ద ఏపీఐఐసీ సేకరిస్తున్న భూములకు రైతులు ,ప్రజలు సహకరించాలని, భూములిచ్చిన వారందరికీ ప్రభుత్వం తగిన పరిహారం ఇస్తుందని చెప్పారు. పరిశ్రమలతో ఈ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. అన్ని వర్గాల వారికి ఉపాధి, ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, దార్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం**

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెదతీనార్ల మత్స్యకార గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను , దొండవాక తీర గ్రామంలో కమ్యూనిటీ హాల్‌ను హోం మంత్రి ప్రారంభించారు. రాజయ్యపేటలో హెటిరో ఔషధ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను హోం మంత్రి ప్రారంభించారు. ముందుగా గ్రామస్థులు కూటమి నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో హెటిరో ప్రతినిధులు కుల్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్,రాజారెడ్డి, సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, టీడీపీ నాయకులు వెంకటేశ్, మేరుగు నాగేశ్వరరావు, కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు నూకరాజు,గోసల చినతాతారావు, పిక్కి శ్రీనివాసరావు, సత్తియ్య, గంగరాజు, మడదా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**బల్క్‌డ్రగ్ వద్దు: యువత**

కాకినాడ జిల్లాలో ప్రజలు తిరస్కరించిన బల్క్‌డ్రగ్ యూనిట్లను నక్కపల్లి మండలంలో ఎలా ఏర్పాటు చేస్తారని ? ఇదే గనుక జరిగితే పర్యావరణం, ప్రకృతి నాశనమవుతుందని పలువురు యువకులు హోం మంత్రి వంగలపూడి అనిత వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం రాజయ్యపేటలో హోం మంత్రి అనిత పర్యటించిన సమయంలో వారు బల్క్ డ్రగ్ వద్దంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఇప్పటికే హెటిరో వల్ల మత్స్యకారుల ఉనికి దెబ్బతిందని, జల, వాయుకాలుష్యం జరుగుతోందని చెప్పారు. రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా చూడాలని కోరారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఏ పరిశ్రమలు ఏర్పాటు చేసినా, భద్రతకు, ప్రజల రక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అవసరమైతే కలెక్టర్‌ను గ్రామానికి తీసుకువచ్చి సమావేశాలు ఏర్పాటు చేస్తామని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.మహేశ్‌బాబు, భయ్యన్న, అంజి, ఆశీరావు, సోమేశ్వరరావు, భూలోక, అప్పలరాజు, గోపీ తదితరులున్నారు.

## బీకేపల్లిలో చురుగ్గా అభివృద్ధి పనులు


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లింగంనాయుడు

కోటవురట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపిరాజుకొత్తపల్లి గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 75 శాతం ఉపాధి హామీ పథకం నిధులు, మిగతా 25 శాతం పంచాయతీ ఫండ్ కింద రూ.30. లక్షలు మంజూరు చేశారు. దీంతో అక్టోబరు నుంచి ఇప్పటివరకు రూ.16.5 లక్షలతో గ్రామంలో చేపట్టిన నాలుగు రహదారులు పూర్తయ్యాయి. మిగిలిన రూ.13.5 లక్షలతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపన చేసినట్టు సర్పంచ్ పెట్ల లింగంనాయుడు తెలిపారు. ఈ పనులను సంక్రాంతిలో పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

## చైర్‌పర్సన్‌ను కలిసిన బీజేపీ నేతలు

ఎలమంచిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బీజేపీలో చేరిన మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిని ఆదివారం ఎలమంచిలిలోని ఆమె నివాసంలో స్థానిక బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులు నక్కా శివ శంకర్, గుత్రాల నగేశ్, సతీశ్ పిట్టా దాసుబాబు తదితరుంతా ఆమెను కలిశారు. ఈ సందర్భంగా రమాకుమారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి'


వివరాలు వెల్లడిస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

ఎస్.రాయవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినఉప్పలం, పెదఉప్పలం రెవెన్యూ పరిదిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు అలియాస్ అప్పన్న డిమాండ్ చేశారు. రేవుపోలవరం గ్రామానికి చెందిన అప్పలరాజు అడ్డరోడ్డులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చినఉప్పలం రెవెన్యూలో 116, 109, 114, 119, 123,124 తదితర సర్వే నంబర్ల పరిధిలో సుమారు 130 ఎకరాల్లోని ప్రభుత్వ భూములతో పాటు పెదఉప్పలం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 428లో గల 112 ఎకరాల ప్రభుత్వ భూములు కొంత మంది దర్జాగా ఆక్రమించుకొని వారి సొంత స్వలాభాలకు వాడుకుంటున్నట్టు ఆరోపించారు. పభుత్వ భూముల వివరాలు తెలపాలని తాను 2022 ఏడాదిలో రెవెన్యూ అధికారులను సమాచార హక్కు చట్టం ద్వారా అడిగానన్నారు. వారు చినఉప్పలంలో సుమారు 130 ఎకరాలు, పెదఉప్పలం పరిధిలో 112 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నట్టు వివరాలు అందజేశారన్నారు. దీనిపై ఇటీవల కొంత మంది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 428లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొంత మంది రైతులు ఉన్నారని తెలిపారన్నారు. అయితే, ఎందుకు ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోలేదని ఆయన సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే న్యాయ పోరాటం చేస్తానని వైస్ ఎంపీపీ అప్పలరాజు హెచ్చరించారు.

# లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాంబిల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకలవలాపల్లి జగన్న కాలనీ సమీపంలో ఆదివారం సాయంత్రం లారీ ఢీకొన్న సంఘటనలో గ్రామానికి చెందిన ఎలమంచిలి చిరంజీవి (27) మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీని విడిచిపెట్టి డ్రైవర్ పరారీ అయ్యాడు. చిరంజీవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరంజీవి మృతితో వారు పెద్ద దిక్కు కోల్పోయారని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి డిమాండ్ చేశారు. అయినప్పటికీ పోలీసులు స్పందించలేదని వారు ఆరోపించారు. ఈ విషయమై ఎస్ఐ నాగేంద్రను వివరణ కోరగా ప్రమాదం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే ఎలా జరిగిందన్న వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడు కుటుంబీకుల నుంచి ఫిర్యాదు రాలేదని, వచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా, లారీ ఢీకొని మృతి చెందిన చిరంజీవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు.

## రెవెన్యూ సంస్థలో రేషన్ డీలర్ల వ్యవస్థ భాగమే: తహసీల్దార్

మునగపాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వ్యవస్థలో రేషన్ డీలర్లు ఒక భాగమేనని స్థానిక తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మండల రేషన్ డీలర్లు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌నుంచి కార్యదర్శులు, సహాయకులు, సర్వేయర్లు, సిబ్బందితో పాటు రేషన్ డీలర్లు అంతా రెవెన్యూ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబం లాంటిందన్నారు. మండల రేషన్ డీలర్లు అసోసియేషన్ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో డీటీ శేషుబాబు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి, సర్వేయర్లు, కార్యదర్శిలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## మోదిమాంబ అమ్మవారి ఆలయానికి రూ.లక్ష విరాళం

మునగపాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తంపరమూల బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న మోదమాంబ ఆలయానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ రూ. లక్ష విరాళం అందజేశారు. మునగపాకలో నెయిలీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబీకులు మోదమాంబ ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. కమిటీ సభ్యులకు ఆదివారం ప్రసాద్ రూ.లక్ష చెక్కు ప్రసాద్ అందించి, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు.

## దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసర సరకుల పంపిణీ

మునగపాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి: మండలంలోని తోటాడ గ్రామంలోని శ్రీఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్టు కొండకర్లలో ఉన్న ఇచ్ఛా ఫౌండేషన్‌లో ఆశ్రమం పొందుతున్న అనాథ వికలాంగ పిల్లలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్నా కుమార్ మాట్లాడుతూ.. తమ సేవలను విస్తృతం చేస్తామన్నారు.ఈ నేపథ్యంలో తమకు దాతలు సహకారం అందించాలని కోరారు.

## 'ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు'

అచ్యుతాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నదని పార్టీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి అదిబాబు తెలిపారు. తిమ్మరాజుపేటలో ఆదివారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల వారు టీడీపీ సభ్యత్వ నమోదు పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. గతంలో ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షల బీమా ఉండేదని, ఇప్పుడు రూ.5 లక్షలకు పెంచారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు యువకులు ఆకర్షితులు అవుతున్నారని చెప్పారు. అందువల్ల యువకులు ఎక్కువగా సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారన్నారు. అలాగే మహిళలు కూడా సభ్యత్వం తీసుకోటానికి ముందుకు రావటిడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మళ్ల చిన్నబాబు, కర్రి నాయుడు, వెంకునాయుడు, వెలగా గోవిద, కర్రి రాజు, ఎస్.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజయ్యపేటలో వైద్య శిబిరం

నక్కపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట మత్స్యకార గ్రామంలో ఆదివారం జనసేన నాయకుడు పిక్కిస్వామి, కుసుమ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి, కేర్ ఆస్పత్రి వైద్య నిపుణుల సుమారు 600 మందికి కేన్సర్, సహ పలు రకాల పరీక్షలను నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో వున్న రోగులు, వృద్ధులను ఆటోల్లో తీసుకువచ్చారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన పిక్కిస్వామిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాబూరావు మాస్టారు, కురందాసు అప్పలరాజు, బంగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

అచ్యుతాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు లేని సంవత్సరంగా 2025ని ఆహ్వానిద్దామంటూ మండల కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా ప్రధానాధికారి మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అంతా దూరంగా ఉండాలన్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు వక్ర మార్గం పడకుండా ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, సభ్యులు కె.కృపానంద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ అథ్లెటిక్స్‌లో రజత పతకం


పతకం అందుకుంటున్న ఉపాధ్యాయుడు రామారావు

ఎస్. రాయవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బి. రామారావు ఆదివారం గుంటూరు ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రజిత పతకం సాధించారు. ఈ పోటీల్లో భాగంగా 400 మీటర్ల పరుగు, ఐదు కే వాకింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ ప్రెసిడెంట్ హాజీ షేక్ లాల్ వజీర్, సెక్రటరీ వెంకటాద్రినుంచి ఈ పతకం అందుకున్నారు. పతకం సాధించిన రామారావును స్థానిక పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



హత్య కేసు నిందితుడితో సీఐ అప్పలరాజు, ఎస్ఐ నాగకార్తీక్, సిబ్బంది

## హత్య కేసులో నిందితుడి అరెస్టు

చోడవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు సీఐ బి.అప్పలరాజు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ ఆవరణలో రెల్లి కాలనీకి చెందిన సోమాదుల ప్రేమ్‌కుమార్‌ను అతని మేనమామ బంగారు దుర్గాప్రసాద్ శుక్రవారం రాత్రి కర్రతో తలపై మోది హతమార్చారని, డబ్బుల లావాదేవీల్లో వివాదాలే ఇందుకు కారణమని చెప్పారు. ఘటన జరిగిన రోజు కూడా వారిద్దరి మధ్య డబ్బుల విషయంలో ఘర్షణ జరిగిందన్నారు. హత్య అనంతరం పారిపోయిన నిందితుడ్ని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వివరించారు.

### సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

జిల్లాలోని వివిధ ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు, ఇతర విలువైన వస్తువులు దొంగలించే నేరాలకు పాల్పడుతున్న గొనిపట్టి సువార్త రాజును పట్టుకున్నట్టు సీఐ బి.అప్పలరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. చీడికాడ మండలం మంచాల గ్రామానికి చెందిన సువార్తరాజు గాజువాక, అనకాపల్లి, చోడవరం ప్రాంతాల్లోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులు ఏమరుపాటుగా ఉన్న సమయంలో సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులు దొంగిలించి పరారవుతాడని చెప్పారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుడి నుంచి పర్సు దొంగిలించే ప్రయత్నించాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లి నిందితుడిని పట్టుకున్నారు. అతని నుంచి పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ నాగ కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవరపాలెం గ్రామానికి చెందిన తోట ఉమామహేశ్వరరావుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉమామహేశ్వరరావుకు ఎమ్మెల్యే చొరవతో రూ.42 వేలను ప్రభుత్వం విడుదల చేసింది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, జనసేన మండల అధ్యక్షుడు బాలిబోయిన సంతోశ్, కూటమి నాయకులు జూరెడ్డి రాము, బండారు నరసింహనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, దాడి ఎరుకునాయుడు, చీపురుపల్లి రామారావు, సింగంపల్లి నారాయణమూర్తి, బండారు దేముడుబాబు, బండారు ప్రసాద్, బొడ్డు అక్కునాయుడు పాల్గొన్నారు.

## ఐదు శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ర్యాలీ



కృష్ణాదేవిపేటలో ర్యాలీగా బయలుదేరిన రెల్లి సామాజిక వర్గీయులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గానికి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ నుంచి ప్రధాన రహదారిపై ప్ల కార్డులతో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కోనా నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి అప్పన్నబాబు మాట్లాడుతూ ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తేనే తమ వర్గానికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ స్పందించాలని కోరారు. అలాగే రెల్లి వర్గీయులకు కుల గణన చేసి అంబేడ్కర్ కలలు కన్నా సామాజిక న్యాయం చేకూర్చాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వై.అప్పన్నబాబు, మజ్జి సత్యనారాయణ, బి.బాబ్జి, కృష్ణ, శివ, కుమార్‌స్వామి, కొండబాబు, చినబాబు, ఎస్.నాగరాజు, కె.శేషు, ఈశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేసిన యువకులకు జ్ఞాపికలు అందిస్తున్న నాయకులు

రావికమతం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్జాపురం గ్రామ సచివాలయం వద్ద ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచ్ పాల్గుణ ప్రారంభించారు. టి.అర్జాపురం, ఆర్.కొత్తూరు, మత్స్వానిపాలెం, దొండపూడి గ్రామాలకు చెందిన 60 మంది యువకులు శిబిరంలో రక్తాన్ని దానం చేశారు. ఈ రకాన్ని అనకాపల్లికి చెందిన అభయాంజనేయ, విశాఖపట్నానికి చెందిన విజయశ్రీ బ్లడ్ బ్యాంకులకు అందజేశారు. అనంతరం కొండనాయుడు మాట్లాడుతూ యువత ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.

## పోలీసు స్టేషన్ భవనం.. ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పోలీసు స్టేషన్ భవనం ఇదే..

నాతవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. పోలీసులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో 2018లో అప్పటి ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన భవన నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. దీంతో పోలీసు ఉన్నతాధికారులు త్వరలో భవనం ప్రారంభిస్తారని ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు.

# ఎట్టకేలకు అధికారుల్లో స్పందన

- మాకవరపాలెంలో దుకాణాల బహిరంగ వేలానికి ఓకే..
- ఐదేళ్ల సమస్యకు మోక్షం.. స్పందనపై పెరిగిన నమ్మకం

**మండల కేంద్రంలో దుకాణాల కేటాయింపు సమస్యకు మోక్షం లభించింది. ఐదేళ్లుగా పట్టించుకోని ఫిర్యాదుపై కూటమి ప్రభుత్వం స్పందించింది. ఎట్టకేలకు షాపులకు వేలం వేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీంతో స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.**

మాకవరపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

మండల పరిషత్ పరిధిలో శ్లాబ్ వేసిన పదిషాపులు, రేకుల షెడ్లతో 15 షాపులు ఉన్నాయి. మరికొన్ని చోట్ల స్థలాలను ఆక్రమించి షాపులు నిర్మించుకున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని మాకవరపాలెం గ్రామానికి చెందిన సమాచార కార్యకర్త పల్లికొండ ఫ్రాన్సిస్ 2020 నుంచి పోరాటం మొదలు పెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో షాపులకు వేలం వేయాలని స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దుకాణాలకు అద్దె పెంచారు తప్పితే వేలం నిర్వహించలేదు. వేలం నిర్వహిస్తే ఒక్కో దుకాణానికి రూ.8 వేలు నుంచి రూ.10 వేల వరకు అద్దె వస్తుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ స్పందనలో దీనిపై ఫిర్యాదు చేశారు. దీనికి ప్రభుత్వం స్పందించి దుకాణాలు వేలానికి సూచించింది. ఈ మేరకు 41వ తీర్మాన సంఖ్య ద్వారా ఓకే చేసినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఏదేమైనా స్పందన ఫిర్యాదుకు కూటమి ప్రభుత్వంలో కదలిక రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బహిరంగ వేలం వేయనున్న దుకాణాలు ఇవే..

# అపూర్వ కలయిక

- పూర్వ విద్యార్థులతో సందడి చేసిన ఎమ్మెల్యే రాజు

చోడవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల తరువాత పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒక్క చోట కలిశారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 1982-83 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు 31 సంవత్సరాల తరువాత కె.కోటపాడు మండలం శివారు చౌడువాడలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి ముచ్చట్లతో కాలక్షేపం చేశారు. పూర్వ విద్యార్థుల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కూడా ఉండడం విశేషం. ఎమ్మెల్యేగా ఎదిగిన తమ చిన్ననాటి స్నేహితులతో కలిసి నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తిరిగి ప్రతి ఏటా కలవాలని వారంతా తీర్మానించి ఆనందంతో ఇళ్లకు వెళ్లారు.



పూర్వ విద్యార్థులతో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

### నర్సీపట్నంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్సీపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా జరిగింది. ఆదివారం 1977-78 పదో తరగతి, 1978-80 ఇంటర్ చదువుకొని వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలలో స్థిరపడిన మిత్రులంతా కలిశారు. ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన ఆత్మీయ వేడుకలో చదువుకునే రోజుల్లో స్మృతులు నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు.

### చీడికాడలో...

చీడికాడ: మండలంలోని తురువోలు ఉన్నత పాఠశాలలో 2010-11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారికి విద్యబోధన చేసిన ఉపాధ్యాయులను పిలిచి చిరు సత్కారం చేశారు. అలాగే పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పాఠశాల పట్ల చూపుతున్న నిబద్ధతకు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. పాఠశాలకు రూ.25 వేలు విలువైన ప్రింటర్‌ను వితరణగా అందించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని చాలా ఆనందంగా గడిపారు. ప్రతి ఏడాది ఏదో ఒక సేవా కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో ఏపీ టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు జీపీఎ.నాయుడు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయి ఎంపీడీవోను నియమించాలి

నాతవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండల పరిషత్ కార్యాలయానికి పూర్తిస్థాయి ఎంపీడీవోను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. సెప్టెంబరు నెలలో ఇక్కడ ఎంపీడీవో వేరే చోటకు బదిలీ చేశారు. అప్పటి నుండి మండల పరిషత్ కార్యాలయానికి పూర్తిస్థాయి ఎంపీడీవోను నియమించలేదు. నర్సీపట్నం ఎంపీడీవో ఉషశ్రీకి ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీవో నాతవరం మండలానికి వారంలో ఒక్కటి లేదా రెండుసార్లుకు మించి రావటంలేదని మండల ప్రజలు చెబుతున్నారు. మండలంలో వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించే సమయం తగ్గుతుందని, ఫలితంగా పనుల్లో నాణ్యత ఉండడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అలాగే మండల ప్రజలకు ఎంపీడీవో పూర్తిస్థాయి సేవలు అందటం లేదని వాపోయారు. నాలుగు నెలల నుంచి ఇన్‌చార్జి ఎంపీడీవోతోనే నెట్టుకువస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి ఎంపీడీవోను నియమించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

## రహదారిపై రంధ్రం.. రాకపోకలకు ఆటంకం



కల్యాణపులోవ రిజర్వాయర్ గట్టుపైకి వెళ్లే రోడ్డులో పడిన రంధ్రం

రావికమతం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసలు రాళ్లు తేలిపోయి అస్తవ్యస్తంగా రహదారి తయారైంది. ఆపై మార్గమధ్యంలోనే పడిన భారీ రంధ్రంతో వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు కల్యాణపులోవ నుంచి రొచ్చుపణుకు వెళ్లే తారు రోడ్డు నుంచి కుంజుర్తి వెళ్లే మార్గాన్ని కలుతూ కల్యాణపులోవ రిజర్వాయర్ గట్టుపైకి, పోతురాజుబాబు ఆలయానికి వెళ్లడానికి వీలుగా పదేళ్ల క్రితం సుమారు 150 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించారు. రిజర్వాయర్ లీకేజీ నీరు కింద పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఈ సీసీ రోడ్డు కింద భాగంలో మదుం ఏర్పాటు చేశారు. ఈ మదుం వాహనాల రాకపోకల ధాటికి కుంగిపోయింది. అసలే రహదారి ఆద్యంతం రాళ్లు తేలిపోయి ప్రమాదకరంగా తయారుకాగా, మార్గమధ్యంలోనే ఈ రంధ్రం ఏర్పడడం వాహన చోదకులను మరింత భయపెడుతోంది. పోతురాజుబాబు ఆలయనికి వచ్చే భక్తులకు, కుంజుర్తి గ్రామస్థుల ఈ రహదారిలో మధ్యలోని రంధ్రం రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాదికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని, మార్గమధ్యంలోని రంధ్రాన్ని పూర్తిగా పూడ్చివేయాలని వారు కోరుతున్నారు.

## అక్కరకురాని ఆర్‌వో ప్లాంట్

- కృష్ణాదేవిపేట కళాశాలలో నిరుపయోగం తాగునీటి వనరు
- రూ.5 లక్షలతో ఏర్పాటుచేసి నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారులు
- తాగునీటికి విద్యార్థుల అగచాట్లు.. ప్రారంభించాలని వేడుకోలు



జూనియర్ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌వో ప్లాంట్ ఇదే..

కృష్ణాదేవిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌వో ప్లాంట్ నెలలు తరబడి నిరుపయోగంగా ఉంది. వైసీపీ పాలనలో నాడు-నేడు పథకంలో రూ.5 లక్షలు నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ ఏడాది జూన్‌లో తీసుకువచ్చిన ప్లాంట్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో ఈ కళాశాలలో చదువుతున్న సుమారు 200 మంది గిరిజన, మైదాన ప్రాంతాల విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యం సమకూరలేదు. అయితే నిధుల కొరతతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు గ్రహణం పట్టిందని అధ్యాపకులు చెబుతున్నారు. కాగా, వైసీపీ పాలనలో కళాశాలలో చేపట్టిన ప్రహరీ, రోడ్డు సౌకర్యం, ఇతర మరమ్మతు పనులు అసంతృప్తిగా మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌వో ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావడంతో పాటు మిగిలిన అభివృద్ధి పనులు పూర్తిచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



అటవీ శాఖ అనుమతుల కోసం గుర్రాలతో నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

## రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని నిరసన

రావికమతం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండశిఖరంపై ఉన్న చలిసంగం గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు గుర్రాలతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ ఈ గ్రామంలో వంద కుటుంబాలకు చెందిన 480 మంది జనభా నివసిస్తున్నారని, రోడ్డు సదుపాయం లేక వారంతా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులు, గర్భిణులు అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు డోలీ మోతలతో వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు. అలాగే నిత్యావసర సరకులకు నెలనెలా కల్యాణపులోవ డిపోకు కాలినడకన కొండ దిగి, ఎక్కడానికి గిరిజనులు నరకం చూస్తున్నారని చెప్పారు. రోడ్డు కోసం 2018-19లోని టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే రాజు రూ.3 కోట్లు మంజూరు చేశారని, ఈలోగా ఎన్నికలు రావడంతో నిధులు నిలిచిపోయాయని చెప్పారు. తర్వాత 2024లో వైసీపీ ప్రభుత్వం రూ.2.65 కోట్ల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఫారెస్ట్ అనుమతులు లేక నిలిచిపోయినట్టు చెప్పారు. ఇప్పటికైనా అటవీ శాఖ అనుమతులు ఇచ్చి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాజు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు చీపురు శంకరావు, గిరిజనులు పాల్గొన్నారు.

## వెంకన్నపాలెం-విశాఖ రోడ్డులో గోతుల పూడ్చివేత



వెంకన్నపాలెం-విశాఖపట్నం రహదారిలో గుంతలు పూడ్చుతున్న దృశ్యం

చోడవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ నుంచి విశాఖపట్నం వెళ్లే రహదారిలో గుంతల పూడ్చివేత పనులను శనివారం చేపట్టారు. బీఎన్ రోడ్డులో చోడవరం నుంచి విశాఖపట్నం వెళ్లే రూట్లో వెంకన్నపాలెం నుంచి అడ్డూరు వరకూ ప్రధాన రహదారిలో గుంతలు ఎక్కువయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు నెలల క్రితం ఈ రూట్లో అక్కడక్కడ గోతుల ఎపూడ్చినప్పటికీ, చాలా గోతులు అలాగే వదిలేశారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 20న 'గోతుల పూడ్చివేతలో నిర్లక్ష్యం' అనే శీర్షికతో ప్రత్యేకంగా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చోడవరం-విశాఖ రూట్లో వెంకన్నపాలెం నుంచి అడ్డూరు వరకూ గుంతల పూడ్చివేత పనులను సంబంధిత అధికారులు శనివారం చేపట్టారు. అలాగే చోడవరం-గోవాడ రూట్లో ఉన్న గుంతలు కూడా పూడ్చి కష్టాలు తప్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

## డ్రైనేజీలను కప్పేస్తున్న పిచ్చి మొక్కలు



తుప్పలతో మూసుకుపోయిన డ్రైనేజీ.. రోడ్డుపైకి వచ్చి కాలువను కప్పేసిన తుప్పలు

మాడుగుల రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల కాలనీలో సీసీ రోడ్లను ఆనుకుని కాలువలను పిచ్చి మొక్కలు కప్పేశాయి. దీంతో డ్రైనేజీల్లో మురుగు ముందుకు సాగకుండా ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతున్నది. ఫలితంగా పరిసరాల్లో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు బెడద ఎక్కువయ్యాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమస్య తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టడం లేదని స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణ తప్పితే డ్రైనేజీల్లో పూడికతీత, వీధుల్లో చెత్త ఊడ్చడం తదితర పనులు చేపట్టడం లేదని వాపోతున్నారు. అలాగే దోమల మందు పిచికారీ చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## యోగా వరల్డ్ కప్ పోటీల్లో విజేతగా చోడవరం చిన్నారి




దైవజ్ఞతో యోగా గురువు సతీశ్

చోడవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న విశాఖలోని రిషికొండ సాయిప్రియ రిసార్ట్‌లో నిర్వహించిన యోగా వరల్డ్ కప్-2024 పోటీల్లో పతంజలి యోగా కేంద్రం విద్యార్థిని ముత్యాల దైవజ్ఞ విజేతగా నిలిచింది. మత్స్య ఆసనం, గండభేరుండ ఆసనం, పద్మ సర్వాంగాసనాల్లో చక్కని ప్రతిభ కనపరిచిన చిన్నారి పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్టు యోగా అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ అధ్యక్షుడు పుల్లేటి సతీశ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో సత్తాచాటిన దైవజ్ఞ తల్లిదండ్రులు ముత్యాల నవీన్‌కుమార్, రమ్యలను స్థానిక పెద్దలు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### 'రోడ్ల దుస్థితిపై ఆర్అండ్‌బీ కార్యాలయం ముట్టడి రేపు'

చోడవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రహదారుల దుస్థితికి నిరసనగా ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ హెచ్చరించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చివేతతో పాటు ఇరుకు వంతెనల వద్ద కనీస జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ గుంతల పూడ్చివేత, ఇరుకు వంతెనల వద్ద రక్షణ ఏర్పాటు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా ఆర్అండ్‌బీ అధికారుల్లో స్పందన కరువైందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, సన్యాసిరావు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు వైద్య సేవలు

నర్సీపట్నం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులకు వైద్య సేవలు అందించారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పట్ట సీఐ గోవిందరావు ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు రాహుల్ నేత్ర పరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేర్ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ పృథ్వీరాజ్, జనరల్ ఫిజీషియన్ రవితేజ వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు సేవలు పొందారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, మండల ప్రతినిధులు రమేశ్, ఎంఎస్ ప్రసాద్, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### 31న అర్లలో గంగాదేవి జాతర

రోలుగుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ల గిరిజన గ్రామంలో ఈ నెల 31న గంగాదేవి అమ్మవారి జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కోలాటాలు, థింసా నృత్యాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జాతర ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, తెల్లవారుజామున 3 గంటలకు అగ్నిగుండంపై నడుస్తూ అమ్మవారిని అనుప కార్యక్రమం ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు.

### కన్నంపేట రైస్ మిల్లులో చోరీ

రావికమతం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్నంపేట రైస్ మిల్లులో సామగ్రిని శనివారం రాత్రి దొంగలు అపహరించినట్టు మిల్లు నిర్వాహకుడు గుమ్మిడు వెంకటేశ్వరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎప్పటిలాగే ఐదు గంటల తర్వాత మిల్లు తలుపులు మూసుకుని వెళ్లిపోయామని, ఆదివారం ఉదయం 9 గంటలకు మిల్లుకు వెళ్లగా తాళాలు విరగొట్టి ఉన్నాయని చెప్పారు. లోపల పరిశీలించగా పిండి, కారం ఆడే మిల్లుల ప్లేట్‌లు, 35 మీటర్ల దాన్యం మిల్లు బెల్ట్ అపహరణకు గురైనట్టు గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మిల్లులో గత నెల మోటారు చోరీ జరిగిందని ఆయన చెప్పారు.

### లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాంబిల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకలవలాపల్లి జగన్న కాలనీ సమీపంలో ఆదివారం సాయంత్రం లారీ ఢీకొన్న సంఘటనలో గ్రామానికి చెందిన ఎలమంచిలి చిరంజీవి (27) మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీని విడిచిపెట్టి డ్రైవర్ పరారీ అయ్యాడు. చిరంజీవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరంజీవి మృతితో వారు పెద్ద దిక్కు కోల్పోయారని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి డిమాండ్ చేశారు. అయినప్పటికీ పోలీసులు స్పందించలేదని గ్రామస్థులు ఆరోపించారు.

ఈ విషయమై రాంబిల్లి ఎస్ఐ నాగేంద్రను వివరణ కోరగా ప్రమాదం జరిగిన విషయం వాస్తవమేనని చెప్పారు. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై మృతుడు కుటుంబీకుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదని, వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. కాగా, మిక్సర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన చిరంజీవి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు.

## అంబులెన్సులో ప్రసవం



పుట్టిన బిడ్డ

సీలేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం సీలేరు జెన్‌కో సీఎస్‌ఆర్ అంబులెన్సు సిబ్బంది చొరవతో గర్భిణీ అంబులెన్సులో సుఖప్రసవం చేయించి పీహెచ్‌సీకి తల్లీ బిడ్డలను సురక్షితంగా తరలించారు. దుప్పులవాడ పంచాయతీ కొత్తపాకలు గ్రామానికి చెందిన సీసా నాయనకు నెలలు నిండడంతో ఆదివారం ఆమెకు పురిటి నొప్పుల ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు సీలేరు పీహెచ్‌సీ జెన్‌కో సీఎస్‌ఆర్ అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఈమెను అంబులెన్సులో సీలేరు తీసుకు వస్తుండగా, సీలేరుకు 5 కిలోమీటర్ల దూరంలో ఐస్‌గెడ్డ వద్దకు వచ్చేసరికి ఆమెకు పురిటినొప్పులు అధికం కావడంతో అంబులెన్సుని అక్కడే నిలిపి సిబ్బంది డెలివరీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ రవిచంద్ర, అంబులెన్సు డ్రైవర్ గణేశ్ పాల్గొన్నారు.

## అద్దె వాహనాల డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు ఎస్‌కే సుభాన్, రమణ

సీలేరు, డిసెంబరు 29, (ఆంధ్రజ్యోతి) : ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు పరిధిలో సివిల్, ఓఅండ్‌ఎం విభాగాల్లో అద్దె ప్రాతిపతిన నడుపుతున్న వాహనాల డ్రైవర్లకు ఏపీ జెన్‌కో నిబంధనలు (487 జీవో ప్రకారం) మేరకు జీతాలతో బాటు ఇతర బెనిఫిట్స్‌ను కాంట్రాక్టర్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె సుభాన్, కన్వీనర్ ఎంవీ రమణ అధికారులను కోరారు. గురువారం వారు మాట్లాడుతూ జెన్‌కో పరిధిలో సీలేరు, డొంకరాయి, మోతూగూడెం పరిధిలో సివిల్ ఓఅండ్ పరిధిలో కాంట్రాక్టర్లు అద్దె ప్రాతిపదికన 20 నుంచి 30 వాహనాల వరకు నడుపుతున్నారన్నారు. డ్రైవర్లకు కనీస వేతనంగా రూ. 18 వేలు వరకు ఇవ్వాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు వారికి రూ. 8 వేలు నుంచి రూ. 10 వేలు వరకు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. జెన్‌కోలో కాంట్రాక్టు దక్కించుకోవడానికి టెండర్లను తక్కువ రేట్లకు కోట్ చేసి, డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా చాలీచాలని జీతాలు ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య జెన్‌కో అధికార్ల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఇకనైనా స్పందించి డ్రైవర్లకు నిబంధనల ప్రకారం జీతాలు, బెనిఫిట్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే అందోళన చేపడతామని సుభాన్, రమణ హెచ్చరించారు.

## కారు ఢీకొని ఒకరికి గాయాలు



ఘటనా స్థలంలో గాయపడిన నలన్‌దాసు

హుకుంపేట డిసెంబరు 29 ఆంధ్రజ్యోతి; కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పాడేరు నుంచి అరకు వైపు అతివేగంతో వస్తున్న కారు అదుపు తప్పి స్థానిక హై స్కూల్ సమీపంలో రోడ్డు పక్కన బైక్ నిలిపి నిల్చున హైవే రోడ్డు పనుల కోసం వచ్చిన బిహార్‌కు చెందిన నలన్‌దాసును ఢీకొంది. దీంతో ఆయన కాళ్లు, ముఖంపై తీవ్రగాయాలన్నాయి. హైవే రోడ్డు పనులకు వచ్చిన తన స్నేహితులు వెంటనే ఆటో పాడేరు జిల్లా ఆరోగ్య కేంద్రానికి నలన్ దాస్‌ను తరలించారు. పరిస్థితి విషమంగా ఉండంతో విశాఖ కేజిహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించినట్టు సమాచారం. ఈ విషయం తెలిసిన స్థానిక ఎస్‌ఐ సురేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల నుంచి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు నమోదుచేశారు.



నుజ్జయిన బైక్, కారు

## గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



గుర్లవాగుపై బ్రిడ్జి ప్రారంభోత్సవంలో శ్రావణ్‌కుమార్, నాయకులు

అనంతగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం కోసమే తన లక్ష్యమని జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రొంపల్లి పంచాయతీ గుర్లకు వెళ్లేమార్గమధ్యన వాగుపై ప్రైవేటు వేంచర్ ఏటీరో సంస్థ రూ.50 లక్షలతో బ్రిడ్జీ నిర్మాణం చేపట్టింది.. దీనిని ఆదివారం శ్రావణ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షకాలంలోని రొంపల్లి పంచాయతీ గిరిజనులు గుర్ల వాగుదాటలేని పరిస్థితి ఉండేది. రెండు జిల్లాల ఈ గెడ్డ ఉండడంతో వంతెన నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది.. ఇంతలోనే ఏటీరో సంస్థ ముందుకు పలు గ్రామాల గిరిజనులకు ఉపయోగకరంగా బ్రిడ్జి నిర్మించడం అభినందించదగిన విషయమన్నారు. చిలకలగెడ్డ నుంచి రొంపల్లి వరకు తారురోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానన్నారు. గాదిల్లోవలో ఉపాధ్యాయుడి నియామకం, మినీ అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు, రొంపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ విన్నవించారు. ఈ కార్యక్రమంలోని ఏటీరో ఫౌండర్ బి.నగేశ్, రొంపల్లి సర్పంచ్ చిరంజీవి, మాజీ సర్పంచ్ పైడితల్లి, టీడీపీ నాయకులు శివ, లక్ష్మణ్‌రావు, నిర్మల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఉదయం 6 గంటల నుంచి ఆలయం కిటకిటలాడింది. మన్యంలో వంజంగి, కొత్తపల్లి తదితర పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని ఆలయ ప్రాంగణంలో పండగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు పర్యవేక్షణలో ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు బి.వెంకటరమణ, సీహెచ్.రామకృష్ణ, దన్నేటిపలాసి రాము, దన్నేటిపలాసి రంజిత్‌కుమార్, జి.శంకరరావు, టి.ఈశ్వరరావు, కె.సతీష్, కె.వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్, కె.దేముడు, ఎల్.రత్నాబాయి, ఎస్.కొండలరావు, కె.రాధాకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పాడేరు ఘాట్ మార్గంలోని మోదాపల్లి జంక్షన్ వద్దగల అమ్మవారి పాదాలకు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## వర్షాలతో మినప పంటకు నష్టం



చింతపల్లిక్యాంప్‌లో తడిసిన పంటను వేరు చేస్తున్న రైతులు

సీలేరు, డిసెంబరు 29 : జీకేవీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలోని చింతపల్లిక్యాంప్‌నకు చెందిన వంతల గెన్ను అనే రైతు తన మూడు ఎకరాల పొలంలో పండించిన మినప పంట అకాల వర్షాలకు దెబ్బతిని భారీగా నష్టపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మినప పంట బాగా పండిందని తమ కష్టాలు గట్టెకుతాయని భావించిన తరుణంలో అకాల వర్షాలకు తమ పంటంతా తడిసిపోయి మొలకలు వచ్చినట్టు ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులు పొలాలను పరిశీలించి ప్రభుత్వపరంగా పంట నష్ట పరిహారం ఇప్పించాలని వంతల గెన్ను కోరారు.

## నేలరాలిన కాఫీ పండ్లు



యర్రబందలో నేలరాలిన కాఫీ పండ్లు

చింతపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు కాఫీ పండ్లు నేలరాలిపోయాయి. చేతి కందొచ్చిన పంట నేల పాలైందని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. గిరిజన ప్రాంతంలో కాఫీ పంట కోతకొచ్చింది. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు వర్షాలు కురవడంతో సకాలంలో పండ్లను రైతులు సేకరించుకోలేకపోయారు. దీంతో కాఫీ పండ్లు 50 శాతం నేలరాలిపోయాయి. నేలరాలిన పండ్లు కుళ్లిపోయాయి. ప్రధానంగా గొందిపాకలు, యర్రబంద, పెద్దూరు, లంబసింగి, కొమ్మంగి, కిటుముల ప్రాంతాల్లో కాఫీ పండ్లు అధికంగా నేలరాలిపోయాయి. అకాల వర్షాలతో కాఫీ పంటను భారీగా నష్టపోవాల్సివచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపోయిన కాఫీ పంటను పరిశీలించి, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని మ్యాక్స్ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు, గిరిజన రైతులు కోరుతున్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు ముందుగా అనుమతి పొందాలి

» లాడ్జీ, రిసార్టుల యజమానులతో డీఎస్పీ ప్రమోద్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

పాడేరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని లాడ్జీలలో, ప్రముఖపర్యాటక కేం ద్రం వంజంగి రిసార్ట్‌లలో నూతన సంవత్సర వేడుకల నిర్వహించేందుకు ఆయా యజమానులు ముందుగా పోలీసుశాఖ నుంచి అనుమతులు పొందాలని డీఎస్పీ పి.ప్రమోద్ సూచించారు. ఆది వారం ఆయన లాడ్జీలు, రిసార్ట్‌ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే లాడ్జీ, రిసార్ట్‌ల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలలో సీసీ టీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవనం, వి క్రయించరాదన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను వినియోగించకుండా చూసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సాగుకు దూరంగా ఉండాలి



పెదబరడలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

చింతపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పెదబరడ గ్రామ పంచాయతీలో గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా దాని మూలాలు గిరిజన ప్రాంతంవైపు కనిపిస్తున్నట్టు ఆయన విచారం వ్యక్తం చేశారు.గంజాయి వల్ల గిరిజన ప్రాంతానికి చెడ్డపేరు వస్తుందన్నారు. గిరిజనులు గంజాయి సాగు, రవాణ చేస్తూ పట్టుబడితే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. గంజాయితో పట్టుబడిన వ్యక్తుల ఆస్తులను సైతం జప్తు చేస్తామన్నారు. గిరిజనులు గంజాయి సాగు, రవాణా పూర్తిగ విడిచిపెట్టాలనారు. గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసులు గుర్తించి సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు జడ్పీ స్కూల్ విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థిని చాందిని

చింతపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోపీనాయ్ చాందిని ఎంపికైనట్టు జిల్లా కోఆర్డినేటర్ పి. రమణమూర్తి తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గోపీనాయ్ చాందిని మండల, జిల్లా స్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 30తేదీన విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు హాజరుకానుందన్నారు.ఈ ఎంపికపై హెచ్‌ఎం వీరభద్రరావు, ఉపాధ్యాయులు చిట్టినాయుడు, సన్యాసిరావు, ప్రకాశరావు అభినందించారు.

## బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

అనంతగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం గ్రామానికి చెందిన రాళ్లపూడి విజయలక్ష్మి(15) బాలిక అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలి వి.. క్రిస్మస్ రోజున మధ్యాహ్నం 12 గంటల సమయంలోని ఇంటికి నుంచి బయటకువెళ్లిన విజయలక్ష్మి తిరిగి రాలేదు. దీంతో తల్లి లక్ష్మి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె ఫిర్యారుపై స్థానిక ఎస్‌ఐ డీ.శ్రీనివాసరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఆచూకీ తెలిస్తే.. ఫోన్లు: 9440904224, 9440904226 తెలియజేయాలని ఎస్‌ఐ తెలిపారు.

## పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి

» హోం మంత్రి వంగలపూడి అనిత



హోం మంత్రికి సమస్య వివరిస్తున్న యువకులు

నక్కపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఆదివారం మండలంలోని పెదబోదిగల్లం సర్పంచ్ మున్నీషా బేగం నేతృత్వంలో ఆ గ్రామస్థులు హోం మంత్రి అనిత నివాసానికి వెళ్లి తమ సమస్యలను మంత్రికి వివరించారు. పెదబోదిగల్లం వద్ద ఏపీఐఐసీ సేకరిస్తున్న భూములకు రైతులు ప్రజలు సహకరించాలని, భూములిచ్చిన వారందరికీ ప్రభుత్వం తగిన పరిహారం ఇస్తుందని చెప్పారు. పరిశ్రమలతో ఈ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. అన్ని వర్గాల వారికి ఉపాధి, ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, దార్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు పారంభం

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెద తీనార్ల మత్స్యకార గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను , దొండవాక తీర గ్రామంలో కమ్యూనిటీ హాల్‌ను హోం మంత్రి ప్రారంభించారు. రాజయ్యపేటలో హెటెరో ఔషధ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను హోం మంత్రి ప్రారంభించారు.

### బల్క్‌డ్రగ్ వద్దు: యువత

కాకినాడ జిల్లాలో ప్రజలు తిరస్కరించిన బల్క్‌డ్రగ్ యూనిట్లను నక్కపల్లి మండలంలో ఎలా ఏర్పాటు చేస్తారని ? ఇదే గనుక జరిగితే పర్యావరణం, ప్రకృతి నాశనమవుతుందని పలువురు యువకులు హోం మంత్రి వంగలపూడి అనిత వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం రాజయ్యపేటలో హోం మంత్రి అనిత పర్యటించిన సమయంలో వారు బల్క్ డ్రగ్ వద్దంటూ ప్ల కార్డులను ప్రదర్శించారు. ఇప్పటికే హెటెరో వల్ల మత్స్యకారుల ఉనికి దెబ్బతిందని, జల, వాయుకాలుష్యం జరుగుతోందని చెప్పారు. రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా చూడాలని కోరారు.

## గిరిజనులను మోసగిస్తే చర్యలు: సీఐ



: సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సీలేరు, డిసెంబరు 29 : గిరిజన రైతులను తూనికలు, కొలతలు, ధర విషయంలో మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని జీకేవీధి సీఐ వరప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం సీలేరు పోలీస్‌స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో కిరాణా, అపరాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయక గిరిజన రైతలు పండించే అపరాల ను గిట్టుబాటు ధర పేరుతో తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. అలాగే, గిరిజనులను సాంప్రదాయ పంటలకు బదులు చట్టవ్యతిరేక గంజాయి సాగు ఉచ్చులోకి దించినా, వారిని ప్రోత్సహించినా, కేసులు తప్పవని హెచ్చరించారు. అలాగే వ్యాపారంలో భాగంగా గంజాయి రవాణా కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. సీలేరు మార్కెట్‌లో వ్యాపారులు గిరిజనులకు ఎంఆర్‌పీ రేట్లు కంటే అధికంగా, నకిలీ సరకులను విక్రయించినా చర్యలు తీసుకుంటున్నారు. కార్పెంటర్ పనులను నిర్వహించే వారు అటవీశాఖ డిపోల్లో అక్రమ కలపతో పర్నీచర్ చేయడానికి వీలులేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్‌ఐ రవీంద్ర, ఎంపీటీసీ సభ్యులు పిల్లా సాంబమూర్తి, వర్తక సంఘం నాయకులు సబిక్, శ్రీను, తదితర్లు పాల్గొన్నారు.

## నిండుకుండలా మత్స్యగెడ్డ



కుమ్మరిపుట్టు సమీపంలో నీటితో కళకళలాడుతున్న మత్స్యగెడ్డ

ముంచంగిపుట్టు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనకు కీలకమైన మత్స్యగెడ్డలో నీరు పుష్కలంగా ఉంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచే భారీ వర్షాలు కురుస్తుండడంతో మత్స్యగెడ్డలో వరదనీరు వచ్చి చేరింది. దీంతో మండల పరిధిలో గల కుమ్మరిపుట్టు, సుజనకోట, పెదగూడ, సారధి, లక్ష్మీపురం, బూసిపుట్టు, రంగబయలు, జోలాపుట్టు, పనసపుట్టు తదితర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ నీటితో కళకళలాడుతోంది. మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో సైతం నీటి నిల్వలు గరిష్ఠ స్థాయిలో నమోదవుతున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మత్స్యగెడ్డలో నీటి వల్ల ఈ ఏడాది జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనకు ఎటువంటి ఇబ్బంది ఉండే అవకాశం లేదని, వచ్చే వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నా గెడ్డలు అడుగంటే అవకాశం లేదని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆయుష్‌కు ఊపిరిలూదేనా?

... 5వ పేజీ తరువాయి

బాధ్యతలను పాడేరు మెడికల్ ఆఫీసరే చూస్తుంటారు.

### విశాఖలో కాస్త మెరుగు

విశాఖ జిల్లాల్లో ఐదు ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉండగా ఒక్క నగరంలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, కేజీహెచ్‌లోని డిస్పెన్సరీల్లో స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన నాలుగుచోట్ల మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. హోమియోకు సంబంధించి ఐదు డిస్పెన్సరీలు ఉండగా, 15 పోస్టులకు గాను ఆరు ఖాళీలు ఉన్నాయి. ప్రసాద్ గార్డెన్స్‌లోని డిస్పెన్సరీలో మెడికల్ ఆఫీసర్ పోస్టు, వేపగుంటలో కాంపౌండర్ పోస్టు, మిందిలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్, అగనంపూడిలో కాంపౌండర్, స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో రెండు యునాని డిస్పెన్సరీలు ఉండగా, రెల్లివీధిలో కాంపౌండర్ పోస్టు, భీమునిపట్నంలో కాంపౌండర్, ఏఎన్ఎం, ఎఫ్ఎన్‌వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

### అధ్వానంగా ఆర్‌డీడీ కార్యాలయం

మధురవాడలో 1987లో ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాటుచేశారు. ఆరు జిల్లాలను పర్యవేక్షించే కార్యాలయం ఒక చిన్న గదిలో నడుస్తోంది. అక్కడ కూర్చునేందుకు సరైన కుర్చీలు, ఫైళ్లు భద్రం చేసేందుకు బీరువాలు, కంప్యూటర్లు లేవు. దీనిపై ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించలేదని చెబుతున్నారు.

## 37 మంది వార్డర్లపై క్రమశిక్షణ చర్యలు

... 5వ పేజీ తరువాయి

కాదన్నారు. అనుమానం వచ్చిన వారిని ఇలా తనిఖీ చేయడం జైళ్లు, పోలీసు శాఖలో సాధారణమేనన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వార్డర్ ఒకరు కొంతమంది ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్నట్టు ప్రత్యేక నిఘా వర్గాల ద్వారా తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే అనుమానితుడిని తనిఖీ చేశారన్నారు. జైలులో ఇబ్బందికర వాతావరణం నెలకొందనే సమాచారం మేరకు ప్రభుత్వం మహేశ్‌బాబును సూపరింటెండెంట్‌గా నియమించి, సరిదిద్దే బాధ్యతను అప్పగించిందన్నారు. ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కేంద్ర కారాగారంలో సుమారు రెండు వేల మందికి పైగా ఖైదీలున్నారని. వారిలో 82 మంది రౌడీషీటర్లు కూడా ఉన్నారన్నారు. బ్యారక్స్‌లను ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకు అన్‌లాక్, సాయంత్రం ఆరు గంటలకు లాకప్ చేయాల్సి ఉందన్నారు. అయితే ఉదయం వార్డర్ తాళాలు తీయాల్సి ఉండగా ఆ పనిని ఖైదీలతో చేయించడం చట్ట విరుద్ధమన్నారు. దీనిని సూపరింటెండెంట్ ప్రశ్నిస్తే అది ఇక్కడ మామూలే అని సమాధానమివ్వడం క్రమశిక్షణా రాహిత్యమన్నారు. జైలులో సమస్యలను నివారించేందుకు సుమారు 200 మంది ఖైదీలను రాజమంహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్టు డీఐజీ వివరించారు.

## కొడుకుని చంపేసిన తండ్రి

... 5వ పేజీ తరువాయి

వచ్చేసరికి భాస్కర్ రక్తపుమడుగులో విగతజీవిగా పడివున్నాడు. రమణ మద్యం మత్తులోనే వున్నాడు. వెంటనే ఆమె ఈ విషయాన్ని అదే ఇల్లు పైఅంతస్థులో ఉంటున్న వారికి చెప్పింది. వాళ్లు ధర్మసాగరంలో నివాసం ఉంటున్న పావనికి కూడా ఫోన్ చేసి సమాచారం చెప్పారు. పావని వచ్చి చూసి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ గోవిందరావు సంఘటనా స్థలానికి చేరుకొని రమణను, అతని కుమార్తె పావనిని విచారించారు. రమణ, భాస్కర్‌తో కలిసి మద్యం సేవించిన జిలానీని పిలిపించి శనివారం రాత్రి ఏం జరిగిందన్నదానిపై ఆరా తీశారు. నిందితుడు రమణను అదుపులోకి తీసుకున్నారు.

## ‘క్రిస్మస్, సంక్రాంతి కానుక ఇవ్వాలి’

సీలేరు, డిసెంబరు 29 , (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు క్రిస్మస్, సంక్రాంతి కానుకలను అందించాలని సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో చంద్రన్న కానుక పేరుతో క్రిస్మస్, సంక్రాంతి పండగలకు నూనె, పప్పు, బెల్లం, వంటి ఆరు రకాల సరకులను పేదల కు అందించారని, గత వైసీపీ పాలనలోనూ జగనన్న కానుకలను ఇచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎందుకు క్రిస్మస్, సంక్రాంతి కానుకలను ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని గిరిజనులు నష్టపోయి పండగలు జరుపుకోలేని పరిస్థితిలో ఉన్నారని, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు చుక్కలను అంటుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఉచిత రేషన్ సరకులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

### ఘనంగా ముగిసిన
## గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవాలు

» భారీగా తరలి వచ్చిన భక్తజనం » ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

» రాత్రి నుంచి ఉదయం వరకు ప్రత్యేక వాహనాలపై ఊరేగించి నిమజ్జనం



అర్ధరాత్రి పురవీధుల్లో కుంచావారి గౌరమ్మను ఊరేగిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కుంచావారి, విజయరామరాజుపేటలోని గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శనివారం రాత్రి ఈ రెండుచోట్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనాలపై ఏర్పాటు చేసి పురవీధుల గుండా ఆదివారం ఉదయం వరకు ఊరేగించారు. అనంతరం శారదా నదిలో నిమజ్జనం చేశారు. దారి పొడవునా భక్తులు ఆది దంపతులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ టీవీ విజయ్‌కుమార్ భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శారదానగర్‌లో పచ్చదనంపై వేటు

» వైసీపీ నేత జన్మదిన వేడుకలకు ఫ్లెక్సీల ఏర్పాటులో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించారని పలువురు ఆరోపణ

» కొత్తూరు సర్పంచ్ లక్ష్మీప్రసన్న ఆగ్రహం » కార్యదర్శికి ఫిర్యాదు



శారదానగర్‌లో తొలగించిన చెట్ల కొమ్మలు



కొమ్మల తొలగింపుతో మోడుగా మారిన చెట్లు

కొత్తూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం శారదానగర్‌లోని రహదారి మధ్యలో డివైడర్‌పై ఉన్న పచ్చని చెట్ల కొమ్మలను పలువురు తొలగించారు. ఇది చూసినవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరుకు చెందిన ఓ వైసీపీ నేత జన్మదిన వేడుకల్లో భాగంగా ఫ్లెక్సీల ఏర్పాటు నిమిత్తం వీటిని తొలగించారని జోరుగా ప్రచారం సాగుతోంది. చెట్ల కొమ్మల తొలగింపు అన్యాయమని మేజర్ పంచాయతీ కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న అన్నారు. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులకు సెలవు అయినప్పటికీ పారిశుధ్య కార్మికులతో కాంట్రాక్టర్ చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టారని ఆరోపించారు. రోడ్డు మధ్యలో ఎప్పటికప్పుడు మొక్కలు పెరిగేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటుంటే, ఒక్కసారిగా ఇలా తొలగించడం అన్యాయమని ఆమె వాపోయారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మొక్కలను సంరక్షించాలని పంచాయతీలకు, అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇక్కడ మాత్రం వైసీపీ నేత వ్యక్తిగత స్వార్థం కోసం కొమ్మలను తొలగించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా, చెట్ల కొమ్మల తొలగించే విషయం తమకు తెలియదన్నారు. అయితే ఈ విషయమై తమకు చాలా ఫోన్లు వచ్చాయని బదులిచ్చారు. ఆదివారం ఎటువంటి పనులు ఎవరికీ తాము అప్పగించలేదని తెలిపారు.

## 5న అనకాపల్లిలో రవాణారంగ కార్మికుల సదస్సు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : రోడ్డు రవాణా రంగ కార్మికుల సమస్యలపై జనవరి ఐదో తేదీన అనకాపల్లిలో సదస్సు నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. ఆదివారం ఇక్కడి యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ హాజరు కానున్నారన్నారు. రోడ్డు రవాణారంగ కార్మికుల సమస్యలపై ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. మోటార్, ఇతర రంగ కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ జి.దేముడునాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఎ.రాజు, ఎం.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో తుమ్మపాలలో ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్‌క్లబ్ సభ్యులు నిత్యం కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, విశ్రాంత అటవీశాఖ అధికారి బీరా వినోద్‌కుమార్, రూరల్ ఎస్ఐ జె.నాగేశ్వరరావు, నాయకులు ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, వంకాయల ఈశ్వరరావు, ఎన్.సత్తిబాబు, రేబాక మధు, కర్రి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో సమస్యలు కోకొల్లలు!

### అధికారులకు పట్టని మేజర్ పంచాయతీ

» శారదానగర్‌లో అపారిశుధ్యం

» పలుచోట్ల రోడ్లపైనే చెత్తాచెదారం

» ముందుకు పారని మురుగు

» తాగునీటి కోసం తిప్పలు



ఇంటింటి కుళాయిల పనుల్లో భాగంగా కప్పివేసిన కాలువ



6వ వీధి కాలువలో మురుగు తిష్ట

కొత్తూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరులో సమస్యలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా పారిశుధ్య సమస్య ఇక్కడివారిని పట్టిపీడిస్తోంది. దీనికి తాగునీటి సమస్య ఇటీవల తోడైంది. వీటిపై అక్కడివారంతా గగ్గోలు పెడుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు.

**కాలువల్లో ముందుకు పారని మురుగు**

మురుగు సమస్య ఇక్కడ తీవ్రంగా ఉంది. కొందరి ఇళ్లముందే తిష్ట వేస్తుండడంతో వారంతా ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. పదిహేను రోజులకు ఒకసారి కాలువల నిర్వహణ చేపడుతున్నారని, అప్పుడు కూడా కాలువల నుంచి తీసి చెత్తాచెదారాన్ని ఆయా గట్లపై వేస్తుండడంతో దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉందని నివాసితులు చెపుతున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు తీసిన గోతులను కప్పే క్రమంలో ఇక్కడి కాలువల్లో రాళ్లు చేరాయి. దీంతో మురుగు ముందుకు పారని పరిస్థితి నెలకొంది.

**వెంటాడుతున్న తాగునీటి కష్టాలు**

ఇంటింటి కుళాయిల ఏర్పాటులో భాగంగా చేపట్టిన తవ్వకాల కారణంగా పైపులైన్ దెబ్బతింది. దీంతో శారదానగర్‌లోని 1, 4, 6, 8, 10, 13 తదితర వీధుల్లో తాగునీరు సరఫరా నిలిచిపోయింది. ఇంటింటి పైపులైన్లు ఏర్పాటుకు ముందు కొంతలో కొంతైనా తాగునీరు వచ్చేదని, ఇప్పుడు పూర్తిగా సరఫరా నిలిచిపోయిందని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు ఆయా వీధుల్లో పైపులైన్ల ఏర్పాటు కోసం చేపట్టిన తవ్వకాలవల్ల మట్టి ఎక్కడికక్కడ పేరుకుపోయింది. దీంతో చిన్నపాటి చినుకు పడినా రోడ్డు చిద్రంగా మారుతోంది. వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోతుండడంతో దోమలు వృద్ధిచెందుతూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని అంతా వాపోతున్నారు.

**8వ వీధిలో అసంపూర్తి రోడ్డుతో అవస్థలు**

శారదానగర్ 8వ వీధిలో కొంత వరకు రోడ్డు వేసినా మరికొంత వేయాల్సి ఉంది. ఈ అసంపూర్తి పనుల కారణంగా వర్షాలు కురిసినప్పుడు దిగువ ప్రాంతంలో నీరు నిలిచిపోతోంది. దీంతో ఇళ్లనుంచి బయటకు రావాలంటేనే అక్కడివారం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 6వ వీధిలో ఉన్న చిన్నపాటి కాలువలు నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయింది.



శారదానగర్ 8వ వీధిలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు

**నీటిని తాగలేకపోతున్నాం**



పంచాయతీ పైపులైన్ నుంచి వచ్చే తాగునీరు సున్నంగా వస్తుంది. దీంతో వీటిని తాగాలంటేనే భయంగా ఉంది. ఎక్కడ రోగాలకు గురవుతామోనని నీటిని బయట నుంచి కొనుక్కొని తెచ్చుకుంటున్నాం. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మాకు ఈ కష్టాలు

\- సేనాపతి ఈశ్వరరావు, శారదానగర్ 6వ వీధి, కొత్తూరు,

**రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలి**



శారదానగర్ 8వ వీధిలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల పూర్తిగా నిర్మించాలి. దీనివల్ల ఇంటి ముందే వర్షపునీరు వారాల తరబడి తిష్ట వేస్తోంది. దీంతో చీకటిపడితే దోమల బెడద తీవ్రంగా ఉంది. నెల రోజులకోసారి పారిశుధ్య కార్మికులు వస్తున్నారు. దీనివల్ల చెత్త ఎక్కడ వేసుకోవాలో తెలియక తామే నేరుగా దూరంగా తీసుకువెళ్లి పారబోసుకుంటున్నాం.

మణికుమార్, రిటైర్డ్ ఆర్టీసీకండక్టర్ శారదానగర్ 8వ వీధి, కొత్తూరు, అనకాపల్లి

**కాలువలను రోజూ శుభ్రం చేయాలి**



ఇంటింటి కుళాయిల పేరుతో గోతులు తవ్వారు. వాటికి ఆనుకొని ఉన్న కాలువల్లో ఈ మట్టి చేరింది. దీంతో మురుగు ముందుకు పారడం లేదు. పారిశుధ్య కార్మికులు అప్పుడప్పుడు వచ్చి మొక్కుబడిగా పారిశుధ్య పనులు చేసి వెళుతున్నారు. ఇటీవల కాలంతో దోమల బెడద సైతం అధికమైంది.

\- రాజేశ్వరి, 6వ వీధి, శారదానగర్, కొత్తూరు

## కశింకోటలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కంటైనర్

» రెండు గంటలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



ఎక్స్‌కవేటర్ల సహాయంతో లారీని పక్కకు తొలగిస్తున్న దృశ్యం



కశింకోట జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

కశింకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట కూడలిలో విద్యుత్ స్తంభాన్ని కంటైనర్ లారీ ఢీకొంది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఆదివారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో తాళ్లపాలెం నుంచి అనకాపల్లి వెళుతున్న కంటైనర్ లారీ కశింకోట కూడలి వద్దకు వచ్చే సరికి ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదం కాలేదు. అయితే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ఈ ఘటనతో జాతీయ రహదారిపై రాకపోకలకు సుమారు రెండు గంటల పాటు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని, కంటైనర్‌ను ఎక్స్‌కవేటర్ల సహాయంతో తొలగించారు. అనంతరం వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

### అనకాపల్లి టీచర్‌కు
## విశిష్ట సేవా పురస్కారం



శ్రీదేవికి పురస్కారం అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి చదువులవారి వీధికి చెందిన ఉపాధ్యాయిని గంపా శ్రీదేవి ఆది వారం తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో పుడమిరత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకున్నారు. మాతా, పితా శతకం, మాతృభాష శతకం, శ్రీ గురువు శతకం, నటరత్న నందమూరి శతకం రచించినందుకు గాను తెలంగాణ పుడమి సాహితీ వేదిక ఆరవ వార్షికోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి శ్రీదేవిని సత్కరించారు. వేదిక జాతీయ అధ్యక్షులు చిలుముల బాలిరెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు హైమావతి, కంచర్ల గోపన్న, కంచర్ల శ్రీనివాసులు, వన సంరక్షణ సమితి అధ్యక్షులు వనజీవి రామయ్య చేతులు మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు ఆమె ఇక్కడి విలేకరులకు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో
## మహిళకు తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైనట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. గవరపాలేనికి చెందిన కర్రి శైలజా అనే మహిళ 26న స్కూటీపై వెళ్తూ సంతోషిమాత ఆలయం వద్ద వాహనాన్ని స్లో చేశారన్నారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొందన్నారు. ఈ సంఘటనలో శైలజాకు బలమైన గాయాలు కావడంతో ఆదివారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

## 'యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు విజయవంతం చేయండి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

తుమ్మపాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడిని రక్షించుకోవడమే ధ్యేయంగా జనవరి ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ వేడుకలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎస్.మురళీమోహనరావు, రెడ్డి మోహనరావు, వాత్సవాయి శ్రీలక్ష్మి, పి.వెంకటరావు, రొంగలి అక్కునాయుడు, జీఎస్ ప్రకాశ్, శేషుబాబు, గొంది చినబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల అదుపులో
## ముగ్గురు పేకాటరాయిళ్లు

లంకెలపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. నగదుతో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాలివి. పెదముషిడివాడ పంచాయతీ పరిధి గండివానిపాలెం తోటల్లో పేకాట జరుగుతున్నట్టు పరవాడ పోలీసులకు సమాచారం అందింది. సీఐ మల్లికార్జునరావు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద రూ.3,290 నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## ఉత్సాహంగా గవర సంక్షేమ సంఘం వన సమారాధన



సమారాధనలో మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ, వేదికపై సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఆదివారం జరిగిన గవర సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. వివిధ ప్రాంతాల నుంచి గవర జాతీయులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌లు మాట్లాడుతూ బీసీ-డిలో ఉన్న గవర జాతీయులను బీసీ-ఎలోకి మార్పు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అంతా ఐక్యంగా ఉండి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. దేశ విదేశాల్లో ఉన్న మనవారందరూ ఒకే కుటుంబం సభ్యులు ఉంటూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు పలు వివిధ కార్యక్రమాల ద్వారా ఆనందోత్సాహల నడుమ ఈ కార్యక్రమం సాగింది. అలాగే వైద్య రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బుద్ద శివాజీ, కొణతాల చంద్రశేఖర్, ఎం.జగన్మోహన్, పిళ్లా త్రినాథ్, ప్రముఖ వైద్యుడు బెనర్జీ, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, కొణతాల రత్నకుమారి, పొలమరశెట్టి వాణి, బీఎస్ఎంకే జోగినాయుడు, కర్రి సన్యాసినాయుడు, కొణతాల భాస్కరరావు, బుద్ద భూలోకనాయుడు, సూరిశెట్టి నరసింగరావుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గౌరీ జాతీయుల పెద్దలు పాల్గొన్నారు.

## యోగా సాధకులు సైకిల్ యాత్ర

తుమ్మపాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి చినబాబు కాలనీలో గల యోగా లైఫ్ సెంటర్ సాధకులు ఆదివారం సైకిల్ యాత్ర నిర్వహించారు. అనకాపల్లి నుంచి కొండకర్ల ఆవ వరకు దాదాపు 25 మంది ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. సెంటర్ వ్యవస్థాపకులు కరణం బాబూరావు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి.రామ్మూర్తి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు సందడి



సబ్బవరం మండలం రావలమ్మపాలెంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



కశింకోట మండలం పడమటమ్మ లోవలో...



వార్డెన్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న వసతి గృహం పూర్వ విద్యార్థులు

సబ్బవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావలమ్మపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా బంగారమ్మపాలెం సమీపంలోని మజ్జిగౌరమ్మ ఆలయం వద్ద ఆదివారం కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్బవరపు శ్రీనివాసరావు, గనివాడ ఈశ్వరరావు, రోమాల అక్కునాయుడు, వంటాకు ముత్యాలనాయుడు, గొటివాడ సత్యనారాయణ, గొంప రమణ, పైడిరాజు, సత్యవతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట డీపీఎన్ హైస్కూల్‌లో 1992-93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నవారంతా ఇక్కడి పడమటమ్మలోవ సమీపంలో కలుసుకున్నారు. తొలుత ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుని నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పేద విద్యార్థులకు భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల వెంకటఅప్పారావు, నంబారు సత్యారావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కోన గంగరాజు, నంబారు రమణ, పెంటకోట సైదునాయుడు, వేగి పాపారావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, మేడిశెట్టి నూకరాజు, పైలా ప్రసాద్, మళ్ల రాంబాబు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని గాంధీనగరం బీసీ బాలుర వసతి గృహంలో 1975- 1985 విద్యా సంవత్సరాల మధ్య ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న వారంతా సత్యనారాయణస్వామి కొండ వద్ద ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. సహపంక్తి భోజనాల అనంతరం నాటి వార్డెన్ యర్రాపాత్రుడు కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. వసతి గృహానికి ఐదు సీలింగ్ ఫ్యాన్‌లను వితరణగా అందజేశారు.